భక్తజన సంద్రం

పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు • శివనామస్మరణతో హోరెత్తిన అప్పికొండ, యారాడ తీరాలు



అప్పికొండ తీరంలో సముద్ర స్నానం చేస్తున్న భక్తులు

పెదగంట్యాడ: అప్పికొండ, యారాడ తీరాలు భక్తజన సంద్రంగా మారాయి. భక్తుల శివనామస్మరణతో పరిసర ప్రాంతాలు మార్మోగాయి. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం రాత్రి జాగారం చేసిన భక్తులు ఆదివారం ఉదయం సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం అప్పికొండ సోమేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయించారు. అప్పికొండతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు, నగరం నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో సముద్ర తీరం నిండిపోయింది. భక్తులు తీరంలోని ఇసుక తిన్నెలపై శివలింగాలను రూపుదిద్ది పూజలు చేశారు. ఏటా ఇక్కడ శివరాత్రి రోజున జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రాత్రంతా భక్తులు హరనామస్మరణ చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. బీచ్‌లో పెట్రోలింగ్ నిర్వహించి, భక్తులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేశారు. సముద్రం లోపలికి వెళ్లకుండా అక్కడ స్తంభాలను ఏర్పాటు చేశారు. 50 మంది గజ ఈతగాళ్లు కాపలా కాశారు.



యారాడ తీరంలో భక్తుల పుణ్యస్నానాలు



పంచాయతన ఆలయంలో అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవ పూజలు చేస్తున్న భక్తులు



అప్పికొండలో భక్తుల సందడి



పూజలందుకుంటున్న అప్పికొండ సోమేశ్వర స్వామి

కమనీయం.. శివపార్వతుల కల్యాణం



మాతృశ్రీనగర్ శివాలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవం



మాతృశ్రీనగర్ శివాలయంలో ప్రత్యేకంగా అలంకరించిన శివలింగం

కూర్మన్నపాలెం: మహాశివరాత్రి మహోత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 86వ వార్డు పరిధి మాతృశ్రీనగర్ శివాలయంలో మహారుద్రాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా జరిపించారు. ఆలయ ధర్మకర్త, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి దామా సుబ్బారావు దంపతులు పాల్గొని, కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

• జీవీఎంసీ 87వ వార్డు పరిధి వడ్లపూడిలోని శ్రీ ఉమామార్కండేయ పద్మశాలి దేవాలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. పంచామృతాలతో స్వామిని అభిషేకించారు. మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. లింగోద్భవ సమయానికి భోళాశంకరునికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఉమామార్కండేయ దేవాలయంలో ..

అప్పికొండలో ఉక్కు ఉద్యోగి సేవలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఎం.ఎం.ఎస్.ఎం. విభాగం సీనియర్ ఫోర్‌మన్ మోడేకుర్తి సత్యనారాయణ మహాశివరాత్రి సందర్భంగా అప్పికొండ సముద్రతీరంలో విశేష సేవలు అందించారు. ఆయన ఏటా శివరాత్రికి అప్పికొండ తీరాన, చందనోత్సవం నాడు సింహాచలంలో సేవలు అందిస్తుంటారు. ఈ ఏడాది కూడా శనివారం మధ్యాహ్నం నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు అప్పికొండ సముద్ర తీరంలో పోలీసు విభాగం ఏర్పాటు చేసిన పబ్లిక్ ఎనౌన్స్‌మెంట్ సిస్టం ద్వారా సముద్ర స్నానాలు చేసే ప్రజలకు నిరాటంకంగా సూచనలు, సలహాలు తెలియజేశారు. 27 ఏళ్లుగా ఇదే విధంగా సేవలు అందిస్తున్న సత్యనారాయణను సౌత్ ఏసీపీ టి. త్రినాథ్, సీఐలు వి. శ్రీనివాసరావు, కె. శ్రీనివాసరావు, ట్రాఫిక్ సీఐ జి. ఉమామహేశ్వరరావు అభినందించారు.



పబ్లిక్ ఎనౌన్స్‌మెంట్ ద్వారా సేవలు అందిస్తున్న సత్యనారాయణ

క్లుప్తంగా

కల్యాణం.. కమనీయం



యజ్ఞోపవీతం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో క్రీడాకారుల సత్తా



పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

పరవాడ: నెల్లూరు జిల్లా కావలిలో మార్చిలో నిర్వహించే రాష్ట్రస్థాయి అండర్–19 బాలుర అంతర్ జిల్లాల బాల్ బాడ్మింటన్ పోటీలకు వాడచీపురుపల్లి ముత్యమాంబ బాల్ బ్యాడ్మింటన్ క్లబ్‌కు చెందిన 10 మంది క్రీడాకారులు ఎంపికయ్యారని క్లబ్ అధ్యక్షుడు కె.ఎస్.నాయుడు చెప్పారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జట్ల ఎంపికను అనకాపల్లి జిల్లా రావికమతం మండలం టి.అర్జాపురం జెడ్పీ పాఠశాలలో శనివారం నిర్వహించారు. జట్టులో కె.అనిల్, జి.మనోజ్, పి.గోపీకృష్ణ, ఆర్.ఆకాష్ తదితరులు ఎంపికైనట్టు తెలిపారు. గ్రామం నుంచి ఎంపికైన క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు.

ఘనంగా సూర్యనారాయణ స్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: మాఘ ఆదివారం పురస్కరించుకుని సుజాతనగర్‌లోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో విశేషంగా పూజలు నిర్వహించారు. ఛాయా, ఉషా దేవేరుల సమేతంగా సూర్యనారాయణస్వామి ఉత్సవమూర్తులను వేదికపై అధిష్టంపజేసి సూర్యనారాయణ స్వామి కల్యాణం నిర్వహించారు. స్వామికి విశేషంగా అభిషేకాలు చేశారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న ఎస్ఐ గౌరి

సీతమ్మధార: ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీ షీటర్లు, పాత నేరస్తులకు సీఐ శ్రీనివాసరావు పర్యవేక్షణలో మహిళా ఎస్ఐ గౌరి కౌన్సెలింగ్ నిర్వహించారు. వారి దినచర్య, సత్ప్రవర్తనతో కలిగి ఉంటున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పలు కేసుల్లో ఉన్న వారి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ త్వరలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి అల్లర్లు, గొడవలు చేయకుండా ఉండాలన్నారు. హద్దు మీరితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నేరాల జోలికి పోకుండా కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు.

కళాకారులకు సత్కారం

అగనంపూడి: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా అగనంపూడి పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం నాలుగు గంటల వరకు కొనసాగిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. 85వ వార్డు పెదమడకలోని ఉమామహేశ్వర స్వామి ఆలయం, కర్రివానిపాలెంలోని సంతోషి ఉమామహేశ్వరస్వామి ఆలయం, అగనంపూడి బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో దివ్య జ్యోతి భవనంలో ఏర్పాటు చేసిన ఉత్సవాలు ఆకట్టుకున్నాయి. తరువాత పెదమడక, కర్రివానిపాలెం ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రజా రవాణా సంస్థ బస్సుల్లో అప్పికొండ సముద్ర తీరానికి స్నానానికి వెళ్లి అక్కడి సోమేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

ఉమామహేశ్వరుని సన్నిధిలో ఏకాహం

పెదమడకలోని ఉమామహేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు ఏకాహం కొనసాగింది. పలువురు కళాకారులు, బాలలు సాంస్కృతిక కళాకారుల ప్రదర్శనలు అలరించాయి. వీరిని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, ప్రముఖులు ఘనంగా సత్కరించారు. ఆదివారం మధ్యాహ్నం పెదమడక, కర్రివానిపాలెం ఆలయాల ఆవరణాల్లో విశేష అన్న సమారాధన చేపట్టారు. కార్యక్రమంలో ఆలయాల, ఉత్సవ కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.



కళాకారులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



87వ వార్డులో ఓటర్లకు కరపత్రాలను అందిస్తున్న కోమటి శ్రీనివాసరావు



ప్రచారంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

కూర్మన్నపాలెం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. జీవీఎంసీ 87వ వార్డు కణితి నాయీబ్రాహ్మణ వీధి, ఏకలవ్యవీధి, రజకుల వీధిలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వడ్లపూడి ఈశ్వరరావు, శీరం పాపారావు, కోనేటి పారిపల్లి, ప్రగడ గోవిందరాజులు, దాసరి రమణ, జెర్రిపోతుల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రచారం

గాజువాక: ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాధవ్‌ను గెలిపించాలని కోరుతూ పాత కర్ణవానిపాలెంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుకర్ తదితరులు ఆదివారం ప్రచారం నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో గాజువాక నుంచి అత్యధిక ఓట్లు వచ్చే విధంగా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ గాజువాక కో–ఆర్డినేటర్ కరణంరెడ్డి నర్సింగరావు, నాయకులు రంజిత్, రాహుల్, రాజశేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆనంద్‌మార్గ్ ఆశ్రమానికి వితరణ

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు ఇందిరానగర్‌లోని ఆనంద్‌మార్గ్ ఆశ్రమానికి రాష్ట్ర భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ఆదివారం నిత్యావసర సరకులు, సామగ్రి అందజేశారు. ఇక్కడ ఉన్న అనాథ పిల్లలకు ఉపయోగపడే వస్తువులు అందించిన అధికారులకు ఆశ్రమ స్వామీజీ సౌమ్యానంద అవధూత కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ బాలకృష్ణ మాట్లాతూ విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. ఓర్పు, సహనంతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో ద్వారకానగర్ సబ్ రిజిస్ట్రార్ నారాయణ, మధురవాడ సబ్ రిజిస్ట్రార్ మోహనరావు, విశాఖ సబ్ రిజిస్ట్రార్ గీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



నిత్యావసర సరకులు, సామగ్రి అందిస్తున్న రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు

స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించరాదు

సీతమ్మధార: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో నాయకులు దీక్షలో పాల్గొన్నారు. ఈ మేరకు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ చేపట్టిన దీక్షలు 687వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రెసిడెంట్ మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగాలన్నారు. అంత వరకు ఈ దీక్ష సాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ బి.నాగభూషణం, ప్రధాన కార్యదర్శి కె.ఈశ్వరరావు, సూరప్పడు తదితరులు పాల్గొన్నారు.



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దీక్షలో పాల్గొన్న నాయకులు

ఉత్సాహంగా విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్నపూర్వ ఉద్యోగులు

సింహాచలం: నేవల్ డాక్‌యార్డు మిషన్‌షాపు విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జీవీఎంసీ 93వవార్డు పరిధి శ్రీనివాస్‌నగర్‌లో ఉత్సాహంగా జరిగింది. రిటైర్డ్ ఉద్యోగులంతానాటి తమ జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకున్నారు. ఉల్లాసంగా...ఉత్సాహంగా గడిపారు. పదవీ విరమణ అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభకనబరిచిన రిటైర్డ్ ఉద్యోగులను ఈ సందర్భంగా సత్కరించారు. విద్యావేత్తగా ఉచిత విద్యా బోధన చేస్తున్న కొండలరావుతో పాటు కళారంగంలో హాస్య ప్రదర్శనలతో ఆకట్టుకుంటున్న ఇ.ఈశ్వరరావును సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఫోర్‌మెన్ కె.ఎ.జాకబ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ టేబుల్ టెన్నిస్ పోటీలకు అంపైర్‌గా ఎల్ఐసీ ఉద్యోగి

డాబాగార్డెన్స్: విశాఖ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి, జీవిత బీమా సంస్థ ఉద్యోగి డాక్టర్ డీవీఎస్‌వై శర్మ ప్రపంచ టేబుల్ టెన్నిస్ పోటీలకు అంపైర్‌గా నియమితులయ్యారు. ఈ నెల 26 నుంచి వచ్చే నెల 6 వరకు గోవాలో జరగనున్న తొలి అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ స్టార్ కంటెండర్ టోర్నమెంట్‌కు శర్మను అంపైర్‌గా ఇంటర్నేషనల్ టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ నియమించింది. శర్మ గత ఏడాది సెప్టెంబర్‌లో లావోస్‌లో జరిగిన ఏషియన్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టేబుల్ టెన్నిస్‌లో అత్యున్నత అంపైర్ టెస్ట్‌లో బ్లూ బ్యాడ్జి అర్హత సాధించారు. ఈ సందర్భంగా ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ డాక్టర్ సుధాకర్ బాబు, మేనేజర్ (పర్సనల్) భగవాన్‌ప్రసాద్, ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం నాయకులు వరప్రసాద్, కామేశ్వరి తదితరులు శర్మని అభినందించారు.

కేంద్రం దిగొచ్చే వరకు ఉక్కు ఉద్యమం

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం దిగొచ్చి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు ఉక్కు ఉద్యమం ఆగదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన ఉక్కు రిలే నిరాహార దీక్షలో 738వ రోజు, ఆదివారం స్టీల్‌ప్లాంట్‌కు చెందిన పలువురు కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు. కార్మికులను ఉద్దేశించి పోరాట కమిటీ నాయకులు మంత్రి రాజశేఖర్, డి. ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, కో–కన్వీనర్ నీరుకొండ రామచంద్రరావు, చిత్రాడ సన్యాసిరావు, టి.ఎస్.ఎన్, కె.వి.రావు, కె.శ్రీనివాస్ ప్రసంగించారు. ప్లాంట్‌ను అభివృద్ధి పథంలో నడిపేందుకు ఎన్నో ఏళ్లుగా ఇక్కడ కార్మికులు ఎంతగానో శ్రమించారన్నారు. లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా అన్నం పెడుతున్న స్టీల్‌ప్లాంట్ లాంటి పరిశ్రమను అమ్మాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించే వరకు వినూత్న రీతిలో పోరాటాలు కొనసాగిస్తామని తేల్చి చెప్పారు. ఇప్పటికైనా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఆపాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, సంస్థలోని కార్మికులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

చిత్ర పరిశ్రమకు నిఘంటువు విశ్వనాథ్

సీతంపేట: కళాతపస్వి కె.విశ్వనాథ్ 93వ జయంతి వేడుకలు వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఘనంగా జరిగాయి. ముందుగా తారకరత్న మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం కె.విశ్వనాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్వనాథ్ దర్శకత్వంలో రూపొందిన స్వాతిముత్యం, సిరివెన్నెల సినిమాలకు సినిమాటోగ్రాఫర్‌గా పనిచేసిన ఎం.వి.రఘును ఈ సందర్భంగా సత్కరించారు. అతిథిగా సీనియర్ నటుడు ఎస్.కె.మిశ్రో మాట్లాడుతూ విశ్వనాథ్‌తో జ్ఞాపకాలను, ఆయన దర్శకత్వంలోని సాగర సంగమం, సిరివెన్నెల చిత్రాల్లో నటించానని గుర్తుచేశారు. ఎం.వి.రఘు మాట్లాడుతూ చిత్ర పరిశ్రమకు కె.విశ్వనాథ్ ఒక నిఘంటువని పేర్కొన్నారు. నిబద్ధత, క్రమశిక్షణ, సమయపాలన, క్లుప్తత, స్పష్టత గుణాలను ఆయన నుంచి నేర్చుకున్నానన్నారు. సొసైటీ కార్యదర్శి ప్రకాశరావు మాట్లాడుతూ త్వరలో విశ్వనాథ్ ఫిల్మ్ ఫెస్టివల్ పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించే ఆలోచన ఉన్నానమన్నారు. అనంతరం స్వాతిముత్యం సినిమాను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఆచార్య ఎన్.ఎ.డి.పాల్, బి.చిన్నారావు, కాశీ విశ్వేశ్వరరావు, డాక్టర్ బాల్జీ పాల్గొన్నారు.



కళాతపస్వి కె.విశ్వనాథ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అతిథులు

ఆటలకు సై..!



పాలిటెక్నిక్ కాలేజీలో ఆధునికీకరించిన ఆట మైదానం



క్రీడల్లో తర్ఫీదు పొందుతున్న విద్యార్థులు

• పాలిటెక్నిక్ కాలేజీలో అందుబాటులోకి ఆధునిక క్రీడా మైదానం
• స్పోర్ట్స్ మీట్‌కు అనుగుణంగా మార్పులు

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఆధునిక ఆట స్థలం అందుబాటులోకి వచ్చింది. ఇక్కడ విశాలమైన మైదానం ఉన్నా.. అది అన్ని రకాల ఆటలకు అనుకూలంగా ఉండేది కాదు. టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ సి.నాగరాణి ఆదేశాల మేరకు స్థానిక ప్రిన్సిపాల్ జి.వి.సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో ఈ స్థలాన్ని అభివృద్ధి చేశారు. సుమారు రెండు ఎకరాల్లో విద్యార్థినీ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఆట మైదానాలను ఆధునికీకరించారు. స్పోర్ట్స్ మీట్‌లకు అనుగుణంగా తీర్చిదిద్దారు. ఇందుకోసం రూ.3.50 లక్షల ఖర్చు చేశారు.

బాలబాలికలకు ప్రత్యేకంగా..

బాలుర ఆట మైదానంలో 200 మీటర్ల ట్రాక్‌ఫీల్డ్, వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్ కోర్టు ఏర్పాటు చేశారు. స్పోర్ట్స్ విభాగానికి సంబంధించి హైజంప్, లాంగ్ జంప్, షాట్ పుట్ క్రీడల నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టారు. బాలికల ఆట మైదానంలో కోకో, బాల్‌బ్యాడ్మింటన్, వాలీబాల్, లాంగ్ జంప్, హైజంప్‌నకు ఏర్పాట్లు చేశారు. ఫార్మసీ బ్లాక్ వద్ద కబడ్డీ కోర్టు అందుబాటులోకి తెచ్చారు. ఇక్కడి వసతి గృహంలో ఉంటున్న విద్యార్థులకు ప్రత్యేకంగా దాని ప్రాంగణంలో బాల్‌బ్యాడ్మింటన్, వాలీబాల్ కోర్టులు సిద్ధం చేశారు. ఇటీవల ఈ కాలేజీలో పలు సౌకర్యాలను పరిశీలించడానికి వచ్చిన సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ సి.నాగరాణి ఆట స్థలాలను పరిశీలించి మెచ్చుకున్నారు. విద్యార్థులను వివిధ పోటీలకు సిద్ధం చేస్తున్నామని ప్రిన్సిపాల్ జి.వి.సత్యనారాయణ మూర్తి తెలిపారు.

క్రీడలకు ప్రాధాన్యం



డిప్లొమా స్థాయిలో విద్యార్థులు క్రీడల్లో పాల్గొనేలా ప్రణాళికలు అమలు చేస్తున్నాం. విద్యార్థులకు వివిధ రకాల ఆట పరికరాలు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులను వివిధ పోటీలకు సిద్ధం చేస్తున్నాం. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం క్రీడల్లో తర్ఫీదు ఇస్తున్నాం. ఈ క్రీడా మైదానంలో ఇటీవల జిల్లా స్థాయి పాలిటెక్నిక్ క్రీడా పోటీలను నిర్వహించాం.

– అబ్బాస్ బేగ్, ఫిజికల్ డైరెక్టర్